మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

15.3.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 325 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## ఈడెన్ గార్డెన్స్ అద్భుతానికి 25 ఏళ్లు
### ఆనాటి భాగస్వామ్యాన్ని గుర్తుచేసుకున్న లక్ష్మణ్



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాదయాత్ర

## కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టుకు

### స్థానిక కార్పొరేటర్లతో కలసి పదివేలమంది నడక
### రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి
### కొండగట్టును అభివృద్ధి చేస్తామని హామీ

*కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు.* - జనతా న్యూస్



03



02

# మరోమారు గరిష్ట విద్యుత్ సరఫరా

### అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు
### అవసరాలను ఎదుర్కొనే సత్తా ఉందన్న భట్టి

తెలంగాణ విద్యుత్ సంస్థలు చరిత్రలో ఒకే రోజున అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించింది. మార్చి 13 న ఉదయం 11:17 గంటలకు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను తట్టుకుని విజయవంతంగా సరఫరా చేసింది. మార్చి 13న తెలంగాణ విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది.



# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

### కమర్షియల్ సిలిండర్లలో కొంత లోటు
### సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం
### ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్స్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష
### ప్రజలు సంయమనంతో ఉండాలని సూచన

**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా

మిగతా 2 లో

# దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

### గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్
### దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి
### అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు



04

మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు.



# తెలంగాణలో టెన్త్ పరీక్షలు ప్రారంభం

### అరగంట ముందుగానే కేంద్రాలకు అనుమతి

*తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి.*

వివరాలు 2 లో



## మూసీ బ్యూటిఫికేషన్ కాదు..
# ఇది భూముల లూటీ పథకం

### ప్రజలకు నష్టం లేకుండా మూసీని సుందరీకరిస్తే అభ్యంతరం లేదు

### రూ. లక్షన్నర కోట్ల భూములపై రేవంత్ రెడ్డి కన్ను
### మొదటి విడతలోనే 3300 ఎకరాలు ఎలా సేకరిస్తారు?
### మూసీని మురికి కూపంగా మార్చిందే కాంగ్రెస్
### ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే
### మూసీపై పవర్పాయింట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

**ఖజానాలో డబ్బులు లేవంటూనే, వేలకోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టును చేపడతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహారం చాలా వింతగా ఉందని అన్నారు. తినడానికి మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవా చేశారు.**

**జనతా న్యూస్, హైదరాబాద్ :** మూసీసుందరీకరణ పేరుతో పేద ప్రజల ఇళ్లు కూలగొట్టి వారి భూములు కొల్లగొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పన్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. "మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. ఇది భూముల లూటీ పథకం" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావులు అడ్డు చెబుతున్నా సరే మొండిగా ముందుకెళ్లాలని భావిస్తున్న రేవంత్ తీరుపై ఆయన భగ్గుమన్నారు. గాంధీ పేరు చెప్పి ఇండ్లు కూల్చి, ఆయనకు చెడ్డ పేరు తీసుకురావొద్దని స్వయంగా.. గాంధీ మునిమనువడు తుషార్ గాంధీ ఈ విషయం

మిగతా 2 లో

# మరోమారు గరిష్ట విద్యుత్ సరఫరా

## అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు

## అవసరాలను ఎదుర్కొనే సత్తా ఉందన్న భట్టి



**హైదరాబాద్,మార్చి14 :** తెలంగాణ విద్యుత్ సంస్థలు చరిత్రలో ఒకే రోజున అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించింది. మార్చి 13 న ఉదయం 11:17 గంటలకు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను తట్టుకుని విజయవంతంగా సరఫరా చేసింది. మార్చి 13న తెలంగాణ విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ రోజున 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి, గత రికార్డు 335.19 మిలియన్ యూనిట్లు (18.03.2025) ను అధిగమించింది. అదే విధంగా, 18,228 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ను కూడా విజయవంతంగా తీర్చింది. ఇది గతంలో నమోదైన 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ కంటే ఎక్కువ. ఉష్ణోగ్రతలు పెరగడం , వ్యవసాయ అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ అవసరం, గరిష్ట లోడ్ రెండూ పెరిగాయి. రాబోయే రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ కొనసాగుతాయి. రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం. సుమారు 19,000 మెగావాట్ల గరిష్ట లోడ్ ను నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. బలమైన విద్యుత్ గ్రిడ్ ,సమన్వయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికతో ఈ అవసరాలను ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది అని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.

# తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి

## ఇంట్లో శవం... పరీక్ష హాలులో విద్యార్థి

## మెదక్ జిల్లాలో కంటతడిపెట్టించిన ఘటన

**మెదక్,మార్చి14 :** మెదక్ జిల్లాలో హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామశివారులో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు మృతిచెందారు. నాగరాజుకు శనివారం అంత్యక్రియలు జరగాల్సి ఉంది. అయితే ఈ దు:ఖాన్ని దిగమింగుకొని ఆయన కొడుకు ధనుశ్ పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. తండ్రి మరణించిన పుట్టెడు దు:ఖంలో కూడా, తన భవిష్యత్తు కోసం కన్నీళ్లతో పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆ విద్యార్థి.. తన సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు (45) అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఉసిరికపల్లి గ్రామ శివారులో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో నాగరాజు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇంటి వద్ద తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగా, తండ్రి కలలను నిజం చేయాలనే పట్టుదలతో ధనుశ్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నారు. తండ్రిని కోల్పోయిన బాధను గుండెల్లో దాచుకుని, కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతుండగా ధనుశ్ పదోతరగతి పరీక్షకు ఈరోజు హాజరయ్యారు. తండ్రి మరణించినా ధైర్యం కోల్పోకుండా పరీక్షకు హాజరైన ధనుశ్‌ను చూసి గ్రామస్థులు చలించిపోయారు. 'ఎంత కష్టమొచ్చినా చదువును వదల్లేదు' అంటూ ధనుశ్‌ను ఓదార్చారు. అధికారులు, ఉపాధ్యాయులు కూడా ధనుశ్‌కు ధైర్యం చెప్పారు. ఒక సామాన్య కుటుంబానికి చెందిన నాగరాజు.. తన కొడుకును గొప్పగా చదివించాలని కలలు కనేవారని స్థానికులు తెలిపారు. ఆ కల కోసం ధనుశ్ కన్నీటితో పరీక్ష రాయడం..ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.

# గుండెపోటుతో ప్రభుత్వ టీచర్ మృతి

## దుఃఖం దిగమింగుకుని కొడుకు పరీక్షకు హాజరు

**యాదగిరిగుట్ట,మార్చి14 :** తండ్రి మరణించిన బాధలోనూ ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. చదువుకు ఉన్న విలువ గురించి తన తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటూ.. శోకసంద్రంలోనూ పరీక్ష రాసేందుకు వచ్చాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పట్టణంలో జరిగిన ఈ ఘటన అందర్నీ కలిచివేసింది. మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల హర్షవర్ధన్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి కూరెళ్ల ఎల్లయ్య గుండాల మండలం వస్తాకొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అతను గుండెపోటుతో మరణించాడు. మరోవైపు హర్షవర్ధన్‌కు శనివారంపదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. దీంతో తండ్రి చనిపోయాడన్న బాధలో ఉండి కూడా శోక సంద్రంలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. పరీక్ష అయిపోయిన తర్వాత మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని తలకొరివి పెడతాడని కుటుంబసభ్యులు తెలిపారు. శోకసంద్రంలో ఉన్నప్పటికీ పదో తరగతి పరీక్షకు హాజరైన హర్షవర్ధన్‌ను చూసి స్నేహితులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు తండ్రి మరణించిన బాధ, మరోవైపు భవిష్యత్తు కోసం పరీక్ష రాయాల్సిన పరిస్థితి అందర్నీ కలిచివేసింది.

# ఇంద్రేశంలో దారుణం

## నిర్మాణ భవనం వద్ద వాచ్‌మెన్ దంపతుల హత్య

**హైదరాబాద్,మార్చి14 :** నగర శివారు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవన వాచ్‌మెన్ దంపతులను కొందరు దుండగులు దారుణంగా హత్య చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గురుడు మండలం దొంగచింత తండాకు చెందిన దంపతులు సోమ్లా దశరథ్ (50), మాన్యమ్మ (45) కొంతకాలం కింద జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనానికి వాచ్‌మెన్‌గా పనిలో చేరారు. అక్కడే నిర్మాణంలో ఉన్న భవనం దగ్గరే ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పనికి వచ్చిన భవన నిర్మాణ సిబ్బంది.. వాచ్‌మెన్ దంపతులను దారుణంగా హత్య చేసినట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఘటనాస్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో దర్యాప్తు చేపట్టారు.

# దళిత అమ్మాయికి మోసం


## ఎమ్మెల్యే పిఎ అరెస్ట్

**జయశంకర్ భూపాలపల్లి,మార్చి14 :** భూపాలపల్లి ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓ దళిత యువతిని ప్రేమపేరుతో మోసం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎమ్మెల్యే కు పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్.. హనుమకొండలో పరిచయమైన చిట్యాల మండలానికి చెందిన ఓ దళిత అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. చాలాకాలంగా ప్రేమించుకోవడంతో పాటు పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే ఓ పోలీస్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెండ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధిత అమ్మాయి కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల పంచాయితీలో సైతం శ్రీనివాస్ అమ్మాయితో పెండ్లికి నిరాకరించాడు. దీంతో అతడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు అమ్మాయిని మోసం చేసిన కేసులో రిమాండ్‌కు పంపినట్టు చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు.

# మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. ఇది భూముల లూటీ పథకం

మొదటి పేజీ తరువాయి

చెప్పారని గుర్తు చేశారు. మూసీ సుందరీకరణతో ఇళ్లు కోల్పోనున్న వారితో కలిసి హియాయత్ సాగర్ లో శనివారం రాత్రి కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేధా పాట్కర్ లాంటి మేధావులు కూడా రేవంత్ రెడ్డి చర్యలకు అడ్డు చెబుతున్నారని తెలిపారు. పేదల ఇళ్లు కూల్చి.. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ చేపట్టడం అవసరమా? అని విమర్శలు వస్తున్నా సీఎం రేవంత్ నిస్సిగ్గుగా తాను రియల్ ఎస్టేట్ గురించే ఆలోచిస్తా. అందులో తప్పేంటి? అని బహిరంగంగా ప్రకటించడం నీతి మాలిన చర్యగా కేటీఆర్ అభివర్ణించారు. ఇదంతా మూసీ ప్రాజెక్టు సుందరీకరణ కోసం చేస్తున్నారా లేక భూముల కోసం చేస్తున్నారు అనుకోవాలా? అని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16 వేల కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఇప్పటికే ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో 6 కిలోమీటర్ల మేర విజయవంతంగా అభివృద్ధి చేశామని వివరించారు. అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల అంచనాలతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ విధ్వంసానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ఎలాంటి డీటెయిల్స్ ప్లానింగ్ రిపోర్టు లేకుండా సోషల్ ఇంపాక్ట్ స్టడీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా వేలమంది ఇండ్లను కూలగొడతామని భయాందోళనకు గురిచేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చట్టాలను... ఇతర నిబంధనలను అన్నింటినీ పాతర వేసి వేలకోట్ల అవినీతికి తెగబడుతున్నదని విమర్శించారు. అభివృద్ధికి తాము ఏమాత్రం వ్యతిరేకం కాదు. అని...అవినీతికి కాంగ్రెస్ పార్టీ భూదాహానికి రేవంత్ రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు మాత్రం వ్యతిరేకమని కేటీఆర్ అన్నారు. "కచ్చితంగా రేవంత్ రెడ్డి అవినీతిని




అడ్డుకుంటాం. పార్టీలకు అతీతంగా హైదరాబాద్ నగర ప్రజలను కాపాడుకుంటాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు పరంగా పెట్టి వందల ఉద్యమాలు చేసి సాధించుకున్న భూమి పుత్రులుగా కాంగ్రెస్ పార్టీ అవినీతిని ఎదుర్కొంటాం. బాధితుల వెంట కచ్చితంగా భారత రాష్ట్ర సమితి ఉంటుంది. ప్రతి ఒక్క ప్రాంతానికి పార్టీ నేతలు పార్టీ శ్రేణులు వచ్చి మరీ నిలబడతాం. ఒక రెండు సంవత్సరాల పాటు మూసి బాధితులు సమిష్టిగా కలిసికట్టుగా ప్రభుత్వం పైన పోరాడితే మా ప్ర భుత్వం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బుల్లోజర్ రాజ్యాన్ని పారదోలి ప్రతి ఒక్కరి ఇళ్లను భూములను కాపాడుతాం" అని కేటీ ఆర్ ఈ సందర్భంగా బాదితులకు భరోసా ఇచ్చారు. "ఇచ్చిన హామీలకు అభివృద్ధికి డబ్బులు లేవు, విపరీతంగా అప్పులు ఉన్నాయని చెబుతున్న రేవంత్ రెడ్డి మూసీ కోసం వేల కోట్లు ఖర్చు పెడతా అంటున్నారు. లక్షన్నర కోట్ల రూపాయలతో మూసిని అభివృద్ధి చేస్తామంటున్నారు. అందాల పోటీలకు ఫుట్బాల్ ఆటలకి వందల కోట్లు ఖర్చు పెడుతూ, మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె లెక్క రేవంత్ రెడ్డి తీరు తయారైంది. గత ప్రభుత్వంలో కేసీఆర్ గారు పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్ రెడ్డి పీపీ టీ ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి. ఎవరి భూములు ఏట్లా లాక్కోవాలి అనే విధ్వంసం గురించి పీపీటీ ఇచ్చారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి స్టార్ హోటల్లో రేవంత్ రెడ్డి పీపీటీ ఇస్తే, మూసీని ఎలా అభివృద్ధి చేయవచ్చో బాధితులతో కలిసి బాధితుల పక్షాన ఈరోజు మేము వివరిస్తున్నాం" అని చెప్పుకొచ్చారు.

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

మొదటి పేజీ తరువాయి

సమావేశం నిర్వహించారు. గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని చెప్పారు. అయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ ఆయిల్ సరఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్టిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్



గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు

కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

# తెలంగాణలో టెన్త్ పరీక్షలు ప్రారంభం

## అరగంట ముందుగానే కేంద్రాలకు అనుమతి

**హైదరాబాద్,మార్చి14 :** తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 2676 కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తామని అధికారులు చెప్పారు. పలు కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్‌ది బెస్టు చెబుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు.

## ఒక్క అభ్యర్థి కోసం ఎగ్జామ్ సెంటర్

### తీరా పరీక్షకు డుమ్మా కొట్టిన విద్యార్థి

సాధారణంగా ఒక్కో పరీక్షా కేంద్రంలో వందలాది మంది ఎగ్జామ్స్ రాస్తుంటారు. కానీ నాగర్‌కర్నూలు జిల్లాలో మాత్రం విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఒక్క విద్యార్థి కోసం ప్రత్యేకంగా ఎగ్జామ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు ఒక ఇన్విజిలేటర్, సూపరింటెండెంట్‌ను నియమించారు. ఎగ్జామ్ సెంటర్‌కు పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. ఇదంతా చేసి తీరా ఎగ్జామ్ పెడితే.. ఆ ఒక్క విద్యార్థి ఎగ్జామ్‌కు డుమ్మా కొట్టి అధికారులకు షాకిచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూలు జిల్లాలో బ్రిడ్జి కోర్సుకు సంబంధించి పరీక్షల కోసం ఇటీవల దరఖాస్తులను స్వీకరించారు. కానీ దీనికి పెద్దగా స్పందన రాలేదు. ఇంటర్ పూర్తి చేసుకున్న వరుణ్ సందేశ్ అనే విద్యార్థి ఒక్కడే పరీక్షకు దరఖాస్తు



చేసుకున్నాడు. జనరల్ బ్రిడ్జి కోర్సు మ్యాథమేటిక్స్ పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించాడు. ఒక్కడే విద్యార్థి దరఖాస్తు చేసుకున్నాడని అధికారులు పట్టించుకోకుండా ఉండలేదు. విద్యార్థికి ఆసక్తి ఉందని భావించి, ఆ ఒక్కడి కోసమే జిల్లాలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు ఒక ఇన్విజిలేటర్, సూపరింటెండెంట్‌ను కేటాయించారు. అలాగే పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇంతా చేసినా ఆ ఒక్క విద్యార్థి మాత్రం ఎగ్జామ్‌కు హాజరుకాలేదు. దీంతో పరీక్షా కేంద్రం ఖాళీగా కనిపించింది. ఒక్క విద్యార్థి కోసం చేసిన ఏర్పాట్లు అన్నీ వృథా కావడంతో అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు.

# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర

## కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టుకు

**స్థానిక కార్పోరేటర్లతో కలిసి పదివేలమంది నడక**

**రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి**

**కొండగట్టును అభివృద్ధి చేస్తామని హామీ**



**కరీంనగర్,మార్చి14 :** కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం భాజపా కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10 వేల మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'అంజన్న ఆశీర్వాద' పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది. సాయంత్రం కొండగట్టుకు ఈ పాదయాత్ర చేరుకోనుంది. బీజేపీ శ్రేణులు ఈ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పది వేలమంది పాల్గొనేలా ఎ÷-లాన్ చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదం, ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్ కార్పొరేషన్‌లో విజయం సాధించామని పేర్కొన్నారు. మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు ఈ పాదయాత్ర చేస్తున్నామని బండి సంజయ్ వివరించారు. పదోతరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పాదయాత్ర కొనసాగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ ఎన్డీయే కూటమి మిత్రుడేనని తెలిపారు. కొండగట్టు అభివృద్ధికి టీటీడీ నిధులను పవన్ కల్యాణ్ కేటాయించారని ప్రస్తావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొండగట్టు అభివృద్ధిని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రసాదం స్కీమ్ కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ హయాంలో చెప్పారని.. కానీ చర్యలు మాత్రం చేపట్టలేదని ఆగ్రహించారు. ఎంఐఎంను తాము భూస్థాపితం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. 'సర్వేజన సుఖీనోభవంతు మా నినాదం' అని చెప్పుకొచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే బ్రాహ్మణుల మీద మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని

అన్నారు. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని ఆరోపించారు. హిందువుల గురించి అనుచితంగా మాట్లాడే పరిస్థితి కాంగ్రెస్ సర్కార్‌లో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మళ్లీ ఎలా గెలిస్తారో చూస్తామని హెచ్చరించారు. తుంగతుర్తిలో ఆయన పతనం ప్రారంభ మైందని ధ్వజమెత్తారు. హిందు దేవుళ్లను మోసం చేసి మరో దేవుడు దగ్గరకు ఆయన ఎలా వెళ్తారని ప్రశ్నించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మీద మత విద్వేషాలను రెచ్చగొట్టినందుకు కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## అంజన్న ఆశీర్వాద యాత్రలో అపశృతి

**బండి సంజయ్ బృందంపై తేనెటీగల దాడి**

కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపట్టిన 'అంజన్న ఆశీర్వాద' పాదయాత్రలో అనుకోని సంఘటన చోటుచేసుకుంది. రామడుగు మండలం కోనరావుపేట ప్రాంతంలో యాత్ర సాగుతుండగా డ్రోన్ కెమెరా ద్వారా ఫుటేజ్ తీసేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. ఈక్రమంలో చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు డ్రోన్ తగిలింది. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు పైకి లేచి దాడి చేశాయి. వెంటనే బండి సంజయ్, ఆయన సిబ్బంది అప్రమత్తమయ్యారు. తేనెటీగల దాడితో యాత్రలో పాల్గొన్న కార్యకర్తలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తేనెటీగల దాడిలో నలుగురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనంతరం తిరిగి మొదలైంది. బండి సంజయ్ చేపట్టిన 'అంజన్న ఆశీర్వాద' యాత్ర కరీంనగర్ నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు సాగనుంది. మొత్తం 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగనుంది. సాయంత్రానికి కొండగట్టుకు బండి సంజయ్ పాదయాత్రగా చేరుకోనున్నారు.

# ఆయిల్ పామ్‌కు ఉజ్వల భవిష్యత్తు

**రైతులు దండిగా ఆయిల్ పామ్ సాగు చేయాలి**

**నర్మెట్ల ఆయిల్ పామ్ సందర్శించిన మంత్రులు**

**22న సిఎం చేతుల మీదుగా ప్రారంభిస్తునవాం**

**వెల్లడించిన తుమ్మల నాగేశ్వర రావు**



**సిద్దిపేట,మార్చి14 :** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులకు పెట్టుబడి, ఎరువులు అన్నీ అందిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా వచ్చిన సమయానికి ఆయిల్ పామ్ టన్ను రూ.12వేలు ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టన్ను ధర రూ.20 వేలకు పైగా పెంచామని చెప్పారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ పంట వేయాలని సూచించారు. ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ సమస్య లేదన్నారు. అన్ని విధాలా రైతులకు లాభాలు ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని చెప్పారు. నర్మెట్టలో త్వరలో రైతు మేళా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగుచేయాలన్నారు. రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మారాలని లేకపోతే రైతులకు నష్టం జరుగుతుందన్నారు . సిద్దిపేట జిల్లా నర్మెటట్టలో మార్చి 22న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి తుమ్మల.. 'తెలంగాణకు సిద్దిపేట కేంద్రంగా ఉంటుంది అందుకే ఇక్కడ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మొదలు పెట్టాం. ఇక్కడ రూ. 40 కోట్లతో రిఫైరీ ఆయిల్ యూనిట్ కూడా ప్రారంభిస్తాం. రైతులు పండించిన వేస్టేజ్ గెలలతో విద్యుత్ తయారు చేస్తాం. కేంద్రం వరి ధాన్యం కొనబోమని చెబుతోంది. రబీలో కూడా అత్యధికంగా మనమే వరి పండిస్తున్నాం. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు. నా వరి పొలంలో కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నా. ఇక్కడ ఉన్న బాలకృష్ణ దళిత రైతు ధైర్యంతో ఆయిల్ పామ్ సాగు చేసి లాభాలు పొందుతున్నారు. ప్రతి రైతు ఆయిల్ ఫామ్ సాగు చేయాలి... సాగు కావాల్సిన అన్ని సబ్సిడీ ప్రభుత్వం మీకు ఇస్తుంది. నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు రూ. 12 వేలకు టన్ను ఉంటే... కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే ఇప్పుడు రూ.21 వేలకు టన్ను చేశాం. రైతులను కష్టాల నుంచి తప్పించాలన్న.. గ్రామాలు పచ్చగా ఉండాలన్నా హార్టికల్చర్ క్రాప్స్ వేయాలి. నేను నా సొంత పొలంలో వక్క సాగు చేస్తున్న... ఆయిల్ పామ్ సాగులో ఇంటర్ క్రాప్ పంటలకు కూడా సబ్సిడీ ఇస్తాం. 30 జిల్లాల్లో పామ్ ఆయిల్ ఎ÷-లాంటేషన్ జరుగుతుంది . రైతులకు ఎలాంటి ఇబ్బంది లేని పంట పామ్ ఆయిల్ . తెలంగాణలోని అన్ని జిల్లాల రైతులను ఇక్కడికి పిలుస్తాం. వారికి కావాల్సిన స్టాల్స్ అన్ని పెడతాం' అని అన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ... మధ్య గుజరాత్ వెళ్లినప్పుడు అక్కడ పాల సేకరణ గ్రామీణ స్థాయి నుండి జరుగుతుంది..అక్కడ అమూల్ పాలు దేశ వ్యాప్తంగా వ్యాపించాయి. ఇక్కడ ఆయిల్ పామ్ ఆయిల్ తుమ్మల నాగేశ్వరరావు స్టార్ట్ చేశారు.. ప్రతి జిల్లాలకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని బావిస్తున్నాం. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ గతంలో ప్రతిపాదనలు జరిగినప్పటికీ 300 కోట్లు కేటాయించి తుమ్మల నాగేశ్వరరావు పనులు పూర్తి చేయించారు. ఈ ప్రాంత రైతాంగానికి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రాంత రైతులు ఆయిల్ ఫామ్ పై దృష్టి సారించాలి..మా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంట పండదు అనే అపోహ నుండి తుమ్మల బయటకు తీసుకొచ్చారు. ఇక్కడి రైతులు ఆయిల్ ఫామ్ పై ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలనీ ఈ ప్రాంత రైతులను కోరుతున్నా అని పొన్నం అన్నారు.

# టోలీ-చౌక్ ప్రాంతంలో అగ్నిప్రమాదం

**ట్రాన్స్‌ఫార్మర్ షాటస్క్యూట్‌తో మంటలు**

**సకాలంలో స్పందించడంతో తప్పిన ముప్పు**

**హైదరాబాద్,మార్చి14 :** టోలిచౌకి కుతుబ్‌షాహి సెవెన్ టూమ్స్ సమీపంలో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన స్థానికులను ఒక్కసారిగా భయాందోళనకు గురిచేసింది. రంజాన్ మాసంలో మసీదులో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో మంటలు చెలరేగడంతో అక్కడ ఉన్న వారు

ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. అయితే మసీదు కమిటీ, స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దాదాపు 2000 మంది ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ ఘటన జరగడం వల్ల కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కానీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని టోలిచౌకి ప్రాంతం ఎప్పుడూ జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశం. ముఖ్యంగా రంజాన్ మాసంలో ఈ ప్రాంతంలోని మసీదులు భక్తులతో కిక్కిరిసిపోతాయి. అలాంటి సమయంలోనే కుతుబ్ షాహి సెవెన్ టూమ్స్ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ పక్కన ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మొదట చిన్నగా ప్రారంభమైన ఈ మంటలు కాసేపట్లోనే భారీగా ఎగిసిపడుతూ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. అగ్ని ప్రమాదం విషయం తెలిసిన వెంటనే మసీదు కమిటీ సభ్యులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించారు. ముందుగా మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకు పంపించారు. అక్కడ ఎలాంటి తొక్కిసలాటకు గురికాకుండా చర్యలు తీసుకున్నారు. మసీదు కమిటీ సభ్యులు, స్థానిక యువకులు కలిసి ప్రార్థనలు చేస్తున్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించడం ద్వారా పెద్ద ప్రమాదాన్ని నివారించారు. ఈ చర్యల వల్ల ఎలాంటి గాయాలు లేదా ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్నిప్రమాదం సబ్‌స్టేషన్ సమీపంలో జరగడంతో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఎలాంటి పెద్ద ప్రమాదం జరగకుండా ఉండేందుకు వెంటనే ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ చర్యల వల్ల మంటలు మరింత విస్తరించే ప్రమాదం తగ్గింది. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ÷ర్ సిబ్బంది అత్యంత వేగంగా స్పందించి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. భారీగా ఎగిసిపడిన మంటలను పూర్తిగా నియంత్రణలోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ అధికారులు కలిసి పరిసర ప్రాంతాలను ఖాళీ చేయించి భద్రతా చర్యలు చేపట్టారు. ఈ అగ్నిప్రమాదానికి గల అమసలు కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ సంబంధిత సమస్య లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది.

# నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

**తెలంగాణ నుంచి ములుగు జిల్లాకు అవకాశం**

**కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు**



**న్యూఢిల్లీ,మార్చి14 :** గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం గ్రామాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం క్రెష్ సెంటర్ వం-ర్కర్లకు రూ.5,000 మాత్రమే వేతనం ఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందని.. దీంతో వేతనాలు పెంచాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవిని కోరినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 1,000 క్రెష్ సెంటర్లు పనిచేస్తున్నాయని.. తక్కువ వేతనాల కారణంగా సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీతక్క శనివారం కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మహిళలు, బాలికల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు కార్యక్రమాన్ని చేపట్టింది. నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాలను ఎంపిక చేసింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి ములుగు జిల్లాను ఎంపిక చేయడంపై మంత్రి సీతక్క ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. నిర్భయ నిధి కింద ములుగు జిల్లాకు రూ.10 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. త్వరలో రాష్ట్రంలో 15,000 అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 2,000 అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపడుతున్నామని, అంగన్వాడీ మౌలిక వసతుల కోసం బ్జడెట్‌లో రూ.100 కోట్లు కేటాయించామని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పాలతో పాటు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రిటైర్డ్ అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షల వరకు బెనిఫిట్లు అందిస్తున్నామని.. కేంద్రం నుంచి అంగన్వాడీ వేతనాల్లో పెంపు అవసరమని మంత్రి సీతక్క వెల్లడించారు.

# ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి వికృతి చేష్టలు

**పెళ్లికి నిరాకరించిన యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్**

**ఫిర్యాదుతో రంగంలోకి దిగి అరెస్ట్ చేసిన పోలీసులు**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి,మార్చి14 :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ప్రాంతంలో సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. తనను పెళ్లి చేసుకోవడం లేదనే కోపంతో ఓ య-ంవకుడు, యువతికి ప్రాణాంతకమైన ఎయిడ్స్ సోకిన రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఎక్కించాడు. సినిమా తరహాలో జరిగిన ఈ పైశాచిక ఘటన ఇప్పుడు కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మనోహర్, బాధితురాలిని కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. మనోహర్‌కు ఎయిడ్స్ పాజిటివ్ ఉందని తెలియడంతో ఆ యువతి అతడితో పెళ్లికి నిరాకరించింది. తన ప్రాణాలను పణంగాపెట్టి పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. తన వ్యాధి గురించి తెలిసి పెళ్లికి నో చెప్పిందనే కోపంతో మనోహర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. 'నేను ఎలాగూ చనిపోతాను.. నువ్వు కూడా నాతోనే రావాలి' అనే వికృత ఆలోచనతో, తన రక్తాన్ని లేదా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఆ యువతి శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘట్‌కేసర్ పోలీసులు వెంటనే స్పందించారు. మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రక్తాన్ని అతను ఎక్కడి నుంచి సేకరించాడు? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ పేరుతో ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.

# మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం

**ఎయిర్ స్పేస్ మూసివేతతో ఇక్కట్లు.. 13 అంతర్జాతీయ విమానసర్వీసులు రద్దు**

**హైదరాబాద్,మార్చి14 :** మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మన హైదరాబాద్ ప్రయాణికులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో 13 అంతర్జాతీయ సర్వీసులు రద్దు అయ్యాయి. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ విమానాలు శనివారం రద్దు అయ్యాయి. మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రయాణికుల భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా ఆయా దేశాల ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేశారు. ఇరాన్ - ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడుల వల్ల అంతర్జాతీయ ఎయిర్ ట్రాఫిక్ పూర్తిగా ప్రభావితమైంది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నాయి. ప్రధానంగా ఈ దేశాలకు వెళ్లాల్సిన విమానాలు నిలిచిపోయాయి. యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, ఇరాన్, ఇజ్రాయిల్ విమానాలు రద్దు అయ్యాయి. విమానాల రద్దుతో ఎయిర్‌పోర్ట్‌లో వేచి ఉన్న ప్రయాణికులకు అధికారులు కొన్ని కీలక సూచనలు చేశారు. ప్రయాణికులు మీ విమానానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి సంబంధిత ఎయిర్‌లైన్స్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. టికెట్ రీ-బుకింగ్ లేదా రీ-రూటింగ్ కోసం ఎయిర్‌లైన్ ప్రతినిధులతో మాట్లాడాలని అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతున్నాయని... ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందే తమ విమాన సమయాలను ఒకసారి సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.

# 17న రవాణాశాఖ మొబిలిటీ సమ్మిట్

**హైదరాబాద్,మార్చి14 :** రవాణా రంగం అభివృద్ధి, విద్యుత్ వాహనాలు తదితర అంశాలపై చర్చించేందుకు హైదరాబాద్ కేంద్రంగా నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్, ఇతర కీలక అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 17న హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్‌లో 2వ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో రవాణా రంగం, స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, నగర రవాణా అభివృద్ధి వంటి అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎలేట్స్ టెక్నోమీడియా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ రవాణా శాఖ ముఖ్య భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు.

# భారత్‌కు మరో రెండు ఎల్పీజి నౌకలు

**హర్మూజ్ దాటి భారత్ వైపు రాక**

**ఇరాన్ సహకారంతో సురక్షితంగా నౌకాయానం**

**వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ,మార్చి14 :** భారత్ మరో విజయం సాధించింది. గల్ఫ్ నుంచి రెండు ఇంధన నౌకలను అత్యంత సురక్షితంగా దేశానికి చేరుకునేలా చేసింది. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందన్నారు. గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయని, వాటిలో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపింది. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని వెల్లడించింది. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశం. గృహవినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అవసరం లేకున్నా చాలామంది బుకింగ్ చేస్తున్నారని తెలిపింది. బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలను కోరామని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొంది. దేశంలో గ్యాస్, ఎల్పీజీ లభ్యతపై ఆందోళనలు నెలకొన్నవేళ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం శాఖ అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించారు. వాణిజ్య సిలిండర్లను ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవు. అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్, బిహార్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో వాణిజ్య సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసే వారిపై దాడులు చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిలిండర్ బుక్ అవడం లేదని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. బుకింగ్‌కు గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉందని పెట్రోలియం శాఖ అధికారులు పేర్కొన్నారు.

# మొజ్తబా ఆచూకీ చెబితే.. 10మిలియన్ డాలర్లు

**రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా**

**వాషింగ్టన్,మార్చి14 :** ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

# ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

**షాపింగ్ మాల్స్ మూతతో పర్యాటకం బంద్**

**దుబయ్,మార్చి 14 :** దుబాయ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల కలల నగరం. పెట్టుబడులకు, రక్షణకు, స్వేచ్ఛా జీవితానికి దుబాయ్ ప్రతీక. విమానయాన రంగానికి కీలక స్థానం. ఎప్పుడూ విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే నగరం. అలాంటి మహా నగరాన్ని ఇరాన్ యుద్ధం కళా విహీనంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధం దుబాయ్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది .యుద్ధం నేపథ్యంలో దుబాయ్ నగరం బోసిపోయింది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలను మూసేశారు. రోడ్లపై జనసంచారం లేదు. నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురి కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చాలా మంది దేశం విడిచి వెళ్లిపోయారు.విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది. డిమాండ్ పెంచడానికి హోటళ్లు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నా స్పందన లేదు. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ తదితర అంతర్జాతీయ బ్యాంకులు తమ కార్యాలయాలను ఖాళీ చేశాయి. వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు.

# అమెరికాలో వీసా మోసాలు

**11మంది భారతీయుల అరెస్ట్.. నేరం రుజువైతే జైలుశిక్ష తప్పదు**

**వాషింగ్టన్,మార్చి14 :** అమెరికాలో కొందరు భారతీయులు అక్రమంగా నివసించేందుకు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఛేదించింది. వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 11 మందిని అరెస్ట్ చేసింది. సదరు వ్యక్తులు నేర బాధితులుగా డ్రామాలాడి, ఇమ్మిగ్రేషన్ పొందేందుకు సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఎఫ్‌బీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఠా ప్రణాళికలో భాగంగా మసాచుసెట్స్ రాష్ట్రంలోని లిక్కర్ షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కన్వీనియెన్స్ స్టోర్లలో నకిలీ దోపిడీలు జరుగుతాయి. ఈ డ్రామాలో ఓ వ్యక్తి ఆయుధంతో షాపులోకి ప్రవేశించి అక్కడి గుమాస్తాను బెదిరించి నగదుతో ఉడాయించగా.. ఇదంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా పోలీసులకు తెలుస్తుంది. ఆ తర్వాత దొంగ దొరక్కుండా జాగ్రత్తపడతాడు. స్టోర్‌లో దోపిడీ నిర్వహించేందుకు యజమాని, అలాగే బాధితుడిగా నటించినందుకు గుమాస్తాకు డబ్బులు చెల్లిస్తారు. ఈ డ్రామా అంతా పూర్తయ్యాక తామే ఈ దోపిడీ చేశామని పోలీసులకు సమాచారమిచ్చి.. ఆ సాక్ష్యాలతో 'యు' నాన్ ఇమిగ్రెంట్ వీసాకు దరఖాస్తు చేసుకుంటుంటారు. అయితే.. మొత్తం వ్యవహారాన్ని రాంభాయ్ పటేల్ అనే వ్యక్తి నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వీసాలు పొందేందుకు బాధితులుగా నటించేవారు అతడికి భారీగా డబ్బులిస్తారని సమాచారం. అతడే ఈ ప్లాన్‌ను అమలు చేస్తుంటాడు. కాగా.. రాంభాయ్ పటేల్, అతడి డ్రైవర్‌ను అధికారులు ఇప్పటికే పట్టుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో జితేంద్ర కుమార్ పటేల్, మహేశ్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమితాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మితుల్ పటేల్, రమేష్‌భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేశ్ పటేల్ ఉన్నారు. వీరిని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలుస్తోంది. వీసా మోసానికి పాల్పడినట్టుగా నేరం రుజువైతే.. మూడేళ్ల జైలు శిక్ష, 2.50 లక్షల డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.2.10 కోట్లు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది.

# దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

**గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్**

**దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి**

**అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు**




**గౌహతి,మార్చి14 :** మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్దాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

# పెట్రోల్, డీజిల్‌లకు కొరత లేదు

**బాటిళ్లలో వాటిని సరఫరా చేస్తే కఠిన చర్యలు**

**తమిళనాడు ఘటనలో డీలర్‌షి రద్దు చేసిన కేంద్రం**

**ఇంధన సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ఆదేశాలు జారీ**

**న్యూఢిల్లీ,మార్చి14 :** పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఇక గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ ఆయిల్ రిఫైనరీ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్‌పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు. గ్యాస్ ఉత్పత్తిని భారతీయ రిఫైనరీలు 30 శాతం మేర పెంచాయని అన్నారు. గృహ వినియోగదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ జాగ్రత్త తీసుకున్నట్టు తెలిపారు. ఇక కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించిన వ్యవహారాల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసింది. కీలక రంగాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా జరిగేలా మార్గదర్శకాల రూపకల్పన, అమలు బాధ్యతలను రాష్ట్రాలకు బదిలీ చేసింది.

# టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

**డిజిటల్ ఎకానమికి సాంకేతిక సహకారం**

**మంత్రి శ్రీధర్ బాబుతో టాంజానియా బృందం భేటీ**

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ):టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజిటల్ ఎకానమీగా మారాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించడానికి తెలంగాణ ముందుకు వచ్చింది. టాంజానియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై సహకారం పెంచాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. టాంజానియాలో ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు చేసే అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. తెలంగాణ 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవల డెలివరీ విధానంపై మార్గదర్శకత్వం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'వీ హబ్' ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై చర్చించారు. స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్ - స్కిల్లింగ్ రంగాల్లో కూడా సహకారం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'త్వరలో తెలంగాణతో ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని టాంజానియా మంత్రి ప్రకటించారు.

# గ్యాస్ దండిగా ఉన్న కృత్రిమ కొరత


**మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామ్**

**హైదరాబాద్,మార్చి14 :** దేశంలో గ్యాస్ కొరత లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కొంతమంది కావాలనే కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. 'యుద్ధం వల్ల అనేక దేశాల్లో గ్యాస్ ధరలు పెరిగాయి. మన దేశంలో మాత్రం పెరగలేదు. మోదీ ప్రభుత్వం ఈ ధరలను నియంత్రణలో పెట్టింది. గతంలో గ్యాస్ ధర రూ.1,200 ఉంటే.. మోదీ ప్రభుత్వం రూ.900లకు తగ్గించింది. మూసీ పునరుజ్జీవానికి రూ.7వేల కోట్లు అంటున్నారు. మూసీ ప్రాజెక్టుకు భాజపా వ్యతిరేకం కాదు. అయితే, 50 మీటర్ల బఫర్ జోన్ అనేది అవసరం లేదు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు 100 ఎకరాలు కావాలా? గుజరాత్‌లో ఎవరికీ నష్టం లేకుండా సబర్మతి ప్రాజెక్టు పూర్తి చేశాం' అని రామచందర్‌రావు అన్నారు.

# ఇంటికే భద్రాద్రి కళ్యాణ తలంబ్రాలు

**ముందస్తు బుకింగ్‌తో అధికారుల ఏర్పాట్లు**

**అన్‌లైన్ బుకింగ్ ద్వారా అందుబాటులో సేవలు**



**భద్రాచలం,మార్చి14 :** తెలుగు రాష్ట్రాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో శ్రీరామనవమి ప్రధానమైనది. 'దక్షిణ అయోధ్య'గా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించే కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి రోజున నిర్వహించే ఈ వార్షిక కళ్యాణ వేడుకను కళ్లారా వీక్షించేందుకు దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. రామదాసు కీర్తనలతో మార్మోగే భద్రాద్రి గిరులు, గోదావరి నది తీరాన జరిగే ఈ అద్భుత ఘట్టం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఈ ఏడాది మార్చి 19న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2 వరకు వైభవంగా సాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా ఈసారి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే భక్తుల కోసం టికెట్ బుకింగ్ , రాలేని భక్తుల కోసం ఇంటికే తలంబ్రాలను పంపే వినూత్న ఏర్పాట్లు కూడా సిద్ధమయ్యాయి. ఈ మహోత్సవంలో అత్యంత ముఖ్యమైన శ్రీ సీతారాముల వార్షిక కళ్యాణం మార్చి 27న జరగనుండగా, మరుసటి రోజు అనగా మార్చి 28న శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. భక్తులు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి ఆలయ అధికారులు ప్రత్యేక సెక్టార్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం భక్తులు భద్రాచలం దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్ హోమ్ పేజీలోని 'శ్రీరామనవమి టికెట్' లింక్‌పై క్లిక్ చేసి, తమకు నచ్చిన కళ్యాణం లేదా పట్టాభిషేకం సెక్టార్‌ను ఎంచుకుని నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ సదుపాయం లేని వారు మార్చి 15 నుంచి భద్రాచలం రామాలయ ప్రధాన కౌంటర్, తానీషా కళ్యాణ మండపం, గోదావరి బ్రిడ్జీ వద్ద ఉన్న దేవస్థానం

విచారణ విభాగం లేదా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ద్వారా నేరుగా టికెట్లు పొందవచ్చు.

దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలానికి రాలేని భక్తుల కోసం కూడా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ. 5,000 లేదా రూ. 1,116 టికెట్లు బుక్ చేసుకుంటే, వారి గోత్ర నామాలతో ఆలయంలో కళ్యాణం నిర్వహిస్తారు. అంతేకాకుండా, స్వామివారి ముత్యాల తలంబ్రాలను భక్తుల ఇళ్లకే చేర్చేందుకు ÷ుఉ÷ూఖిఅ లాజిస్టిక్స్ విభాగం ప్రత్యేక సేవలను అందిస్తోంది. రూ. 151 చెల్లించి సమీప ఆర్టీసీ కౌంటర్లలో లేదా ఆన్‌లైన్ ద్వారా తలంబ్రాలను బుక్ చేసుకుంటే, ఉత్సవాల అనంతరం వాటిని ఇంటికే డెలివరీ చేస్తారు. ఈ ఏడాది సుమారు 5 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు, 2 లక్షల చిన్న లడ్డూలు , 3 వేలకు పైగా మహా లడ్డూలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చాయి.

# ఈడెన్ గార్డెన్స్ అద్భుతానికి 25 ఏళ్లు

## ఆనాటి భాగస్వామ్యాన్ని గుర్తుచేసుకున్న లక్ష్మణ్



భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన ఈడెన్ గార్డెన్స్ అద్భుతానికి నేటితో 25 ఏళ్లు పూర్తయ్యాయి. 2001లో ఆస్ట్రేలియాపై ఫాలో ఆన్ ఆడుతూ టీమిండియా సాధించిన ఈ చారిత్రక విజయం టెస్టు క్రికెట్ చరిత్రలోనే గొప్ప పునరాగమనాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ విజయంలో కీలకపాత్ర పోషించిన మాజీ బ్యాటర్, ప్రస్తుత బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. 2001 మార్చి 14న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నాలుగో రోజు ఆట ప్రారంభమయ్యే సమయానికి భారత్ ఓటమి అంచున ఉంది. తొలి టెస్టులో ఘోర పరాజయం పాలైన టీమిండియా, రెండో టెస్టులో ఫాలో ఆన్ ఆడుతోంది. నాలుగో రోజు ఉదయం భారత్ స్కోరు 254/4. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 20 పరుగులు వెనుకబడే ఉంది. చేతిలో ఆరు వికెట్లు మాత్రమే ఉండటంతో ఆసీస్ విజయం లాంఛనమేనని అందరూ భావించారు. అయితే, ఓవర్‌నైట్ స్కోరు 109 పరుగులతో క్రీజులో ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ అసాధారణమైన పోరాటాన్ని ప్రదర్శించాడు. అతనితో పాటు రాహుల్ ద్రవిడ్ కూడా అద్భుతంగా నిలిచాడు. ఈ ఇద్దరూ కలిసి ఆసీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ భారత స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లక్ష్మణ్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడి టెస్ట్ క్రికెట్ గతిని మార్చేశాడు. ఈ చారిత్రక భాగస్వామ్యంపై లక్ష్మణ్ 'ఎక్స్' వేదికగా స్పందించాడు. "25 ఏళ్ల క్రితం ఈడెన్ గార్డెన్స్‌లో నేను, రాహుల్ పంచుకున్న భాగస్వామ్యం ఎప్పటికీ ప్రత్యేకం. ఓటమి ఖాయమనుకున్న దశలో మేం నమ్మకం, సహనం, పట్టుదలను ఎంచుకున్నాం. ఆ భాగస్వామ్యం కేవలం పరుగుల గురించి మాత్రమే కాదు, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకం, టీమ్‌వర్క్, ప్రతి సెషన్ కోసం పోరాడటం గురించి. రాహుల్‌తో కలిసి ఆ ప్రయాణంలో పాలుపంచుకున్నందుకు గర్వంగా ఉంది. క్రికెట్‌లో పునరాగమనాలు ఎప్పుడైనా సాధ్యమేనని గుర్తుచేసిన టెస్టు అది" అని ద్రవిడ్‌తో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ లక్ష్మణ్ పేర్కొన్నాడు. ఆ చారిత్రక ఇన్నింగ్స్‌లో లక్ష్మణ్ 281 పరుగుల వద్ద ఔటయ్యాడు. అప్పటికి ఇదే ఓ భారత బ్యాటర్ చేసిన అత్యధిక టెస్ట్ స్కోరు. మరోవైపు ద్రవిడ్ 180 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 657/7 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 212 పరుగులకే కుప్పకూలింది. హర్భజన్ సింగ్ ఆరు వికెట్లతో చెలరేగి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెవిన్ పీటర్సన్ గుడ్ బై

## కామెంటరీ బాక్స్‌లో కలుసుకుందాం అంటూ కామెంట్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీకి వీడ్కోలు పలుకుతున్నట్టు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. జట్టు మెంటార్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించాడు. అయితే, ఈ లీగ్ లో గతంలో మాదిరే కామెంటేటర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించింది. హెడ్ కోచ్ హేమాంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్ మాథ్యూ మోట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ వంటి సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి కేపీ పనిచేశాడు. "ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా కొనసాగలేను. ఈ బాధ్యతలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు. అయితే, కామెంటరీ బాక్స్‌లో మళ్లీ కలుస్తాను" అని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశాడు దక్షిణాఫ్రికాలో జన్మించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున 104 టెస్టులు, 136 వన్డేలు ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచి ఇంగ్లండ్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణే జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఇదిలా ఉండగా, బీసీసీఐ ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 20 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా పూర్తి షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ తెలిపింది.

## ద్రవిడ్, మిథాలీ, రోజర్ బిన్నీలకు

# బీసీసీఐ లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డులు








భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన దిగ్గజాలకు బీసీసీఐ అత్యున్నత గౌరవాన్ని అందించనుంది. ప్రతిష్ఠాత్మక 'నమన్ అవార్డులు-2026'లో భాగంగా టీమిండియా మాజీ ఆటగాళ్లు రాహుల్ ద్రవిడ్, రోజర్ బిన్నీలతో పాటు మహిళా క్రికెట్ ఐకాన్ మిథాలీ రాజ్‌కు జీవిత సాఫల్య పురస్కారాలు ప్రకటించింది. న్యూఢిల్లీలో మార్చి 15వ తేదీన ఈ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. పురుషుల విభాగంలో బీసీసీఐ అత్యున్నత పురస్కారమైన 'కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారా'న్ని రాహుల్ ద్రవిడ్, రోజర్ బిన్నీలకు అందజేయనున్నారు. మహిళల క్రికెట్‌కు మిథాలీ రాజ్ చేసిన విశేష సేవలకు గాను ఆమెకు 'బీసీసీఐ జీవిత సాఫల్య పురస్కారా'న్ని బహూకరించనున్నారు. ఆటగాళ్లుగా, కోచ్‌లుగా, నిర్వాహకులుగా భారత క్రికెట్ ఎదుగుదలకు వీరు అందించిన సేవలను బీసీసీఐ ఈ పురస్కారాల ద్వారా గుర్తించింది. వీరితో పాటు 2024-25 సీజన్‌కు గాను ప్రస్తుత ఆటగాళ్లకు కూడా అవార్డులు ప్రకటించారు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండోసారి 'పాలి ఉమ్రిగర్ అవార్డు' (ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ - పురుషులు) అందుకోనుండగా, స్మృతి మంధానా ఐదోసారి ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్‌గా నిలిచారు. ఈ ఏడాది నమన్ అవార్డుల వేడుకలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఇటీవల ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఐదు భారత జట్లను (సీనియర్ పురుషుల, మహిళల, అండర్-19 జట్లు) బీసీసీఐ ఒకే వేదికపై ఘనంగా సత్కరించనుంది. అదేవిధంగా, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన పలువురు ఆటగాళ్లతో పాటు, ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు కూడా అవార్డు అందజేయనున్నారు.

# కేకేఆర్‌కు భారీ షాక్..

## గాయంతో స్టార్ పేసర్ ఔట్



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కీలక యువ పేసర్ హర్షిత్ రాణా మోకాలి గాయం కారణంగా ఈ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. ఈ నెల 28న టోర్నీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పరిణామం కేకేఆర్ బౌలింగ్ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గత ఫిబ్రవరిలో జరిగిన టీ20 ప్రపంచకప్‌కు ముందు దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ సందర్భంగా హర్షిత్ రాణా మోకాలికి గాయమైంది. అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్న అతను, ఐపీఎల్ నాటికి కోలుకోవడం అసాధ్యమని తెలుస్తోంది. ఈ మేరకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' తన కథనంలో పేర్కొంది. "హర్షిత్ రాణా దురదృష్టవశాత్తూ అందుబాటులో ఉండడు. కానీ, ఇది జట్టులోని ఇతర బౌలర్లైన వైభవ్, ఉమ్రాన్, కార్తీక్, ఆకాశ్‌లకు ఒక మంచి అవకాశం. అతని స్థానంలో ఇంకా ఎవరినీ భర్తీ చేయాలని నిర్ణయించలేదు" అని కేకేఆర్ అధికారి ఒకరు చెప్పినట్లు ఆ కథనం వెల్లడించింది. ఇదిలా ఉంటే... హర్షిత్ రాణా దూరం కావడంపై వార్తలు రావడానికి కొన్ని గంటల ముందే కేకేఆర్ యాజమాన్యం తమ బౌలింగ్ దళాన్ని బలోపేతం చేసుకుంది. జింబాబ్వే పేస్ సంచలనం బ్లెస్సింగ్ ముజరబానీని జట్టులోకి తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తైన ఈ రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్, తన పేస్, బౌన్స్‌తో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టగలడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో 13 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాడు. "ముజరబానీ చేరికతో మా పేస్ దళం మరింత పటిష్ఠమైంది. టీ20 ఫార్మాట్‌లో అతనికి అపారమైన అనుభవం ఉంది" అని కేకేఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయంగా 80కి పైగా టీ20 మ్యాచ్‌లలో 90కి పైగా వికెట్లు పడగొట్టాడని, అతని సగటు కేవలం 21గా ఉందని పేర్కొంది. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను వదులుకున్న కేకేఆర్, ఇప్పుడు ముజరబానీ రాకతో పేస్ విభాగంలో ఏర్పడిన లోటును కొంతమేర భర్తీ చేసుకున్నట్లయింది. ఒకవైపు కీలక భారత పేసర్ దూరమైనా, మరోవైపు అనుభవజ్ఞుడైన విదేశీ బౌలర్‌ను చేర్చుకోవడం ద్వారా కేకేఆర్ సమతుల్యం పాటించే ప్రయత్నం చేస్తోంది.

# బ్యాడ్మింటన్ స్కోరింగ్ మార్పులపై వ్యతిరేకత వ్యక్తం చేసిన సైనా నెహ్వాల్



భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రతిపాదిస్తున్న స్కోరింగ్ మార్పులపై తన వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 21 పాయింట్ల (3x21) విధానాన్ని మార్చి, దాని స్థానంలో 15 పాయింట్ల (3x15) విధానాన్ని తీసుకురావాలనే ఆలోచనను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. పాత విధానమే (21 పాయింట్లు) క్రీడాకారుల ఓర్పును, ఆట అసలైన నైపుణ్యాన్ని పరీక్షిస్తుందని ఆమె అభిప్రాయపడింది. డెన్మార్క్‌లోని హెర్సెన్స్‌లో ఏప్రిల్ 25న జరగనున్న బీడబ్ల్యూఎఫ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ 15 పాయింట్ల విధానంపై ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో, ఇంటర్నేషనల్ మూమెంట్ టు యునైటెడ్ నేషన్స్ సలహాదారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సైనా, ఆట స్ఫూర్తిని కాపాడాలని పిలుపునిచ్చింది. 15 పాయింట్ల విధానం వల్ల ర్యాలీలు తగ్గిపోయి, ఆట నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని, ఇది కేవలం అదృష్టంపై ఆధారపడేలా మారుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి, అధికారులు వాణిజ్య పరమైన కోణంలో కాకుండా... క్రీడాకారుల సంక్షేమం, ఆట సాంప్రదాయం వైపు నుంచి ఆలోచించాలని కోరింది.

# వివాదాస్పద రనౌట్

## పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ ఆఘాకు ఐసీసీ మందలింపు




బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ బ్యాటర్ సల్మాన్ ఆఘా ఐసీసీ చర్యలకు గురయ్యాడు. విచిత్ర రీతిలో రనౌట్ కావడంపై అసహనం వ్యక్తం చేస్తూ క్రికెట్ పరికరాలను దురుసుగా విసిరికొట్టినందుకు అతడిని మందలించడంతో పాటు, ఒక డిమెరిట్ పాయింట్‌ను జతచేశారు. శుక్రవారం షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సల్మాన్ ఆఘా, మహ్మద్ రిజ్వాన్ కలిసి 109 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ 39వ ఓవర్‌లో బంగ్లా కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ వేసిన బంతిని రిజ్వాన్ నెమ్మదిగా పుష్ చేశాడు. నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో క్రీజు బయట ఉన్న పాక్ బ్యాటర్ ఆఘా వద్దకు బంతి దొర్లుకుంటూ వచ్చింది. అతడు బంతిని చేత్తో పట్టుకుని బౌలర్‌కు తిరిగి ఇవ్వబోయాడు. వెంటనే అప్రమత్తమైన మిరాజ్... ఆఘా కంటే ముందే ఆ బంతిని అందుకుని వికెట్లను గిరాటేశాడు. ఆఘా క్రీజు బయటే ఉండటంతో థర్డ్ అంపైర్ అతడిని రనౌట్‌గా ప్రకటించాడు. ఈ ఊహించని పరిణామంతో తీవ్ర నిరాశకు గురైన సల్మాన్ ఆఘా, పెవిలియన్‌కు వెళుతూ కోపంతో తన గ్లోవ్స్‌ను నేలకేసి కొట్టాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను ఉల్లంఘించడమే. ఈ విషయంపై మ్యాచ్ రిఫరీ నేమూర్ రషీద్ 'ది డైలీ స్టార్'తో మాట్లాడుతూ.. "సల్మాన్‌కు గతంలో ఇలాంటి ప్రవర్తనకు పాల్పడిన చరిత్ర లేదు. అన్ని అంశాలను, ఐసీసీ నిబంధనలను పరిగణలోకి తీసుకుని అతడిని మందలించి, ఒక డిమెరిట్ పాయింట్ ఇచ్చాం" అని వివరించారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 274 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 243 పరుగులుగా నిర్దేశించగా, ఆ జట్టు కేవలం 114 పరుగులకే కుప్పకూలింది. దీంతో సిరీస్ 1-1తో సమం అయింది. ఆదివారం నిర్ణయాత్మక మూడో వన్డే జరగనుంది.

# పవన్ 'ఉస్తాద్' ప్రీమియర్స్.. మేకర్స్ ప్లానేంటి?



టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ రిలీజ్ కు సిద్ధమవుతోంది. డాషింగ్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. ఉగాది కానుకగా థియేటర్స్ లో మార్చి 19వ తేదీన రిలీజ్ కానుంది. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ తోపాటు అభిమానుల్లో మంచి అంచనాలు ఉ ండగా.. సినిమా కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా హరీష్-పవన్ కాంబోలో ఇప్పటికే వచ్చిన గబ్బర్ సింగ్ మూవీ సూపర్ హిట్ గా నిలవడంతో.. ఉస్తాద్ భగత్ సింగ్ పై అందరి దృష్టి పడింది. అయితే మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఆ సినిమా ప్రీమియర్స్ సంగతేంటన్న విషయంపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మేకర్స్ ప్లాన్ ఏంటోనని అంతా మాట్లాడుకుంటున్నారు. నిజానికి.. ఓవర్సీస్ లో ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ ప్రీమియర్స్ ఉంటాయని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. ఇప్పుడు ఏపీలో ప్రీమియర్స్ బదులు ఎర్లీ మార్నింగ్ బెనిఫిట్ షోస్ వేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఆ షో టికెట్ ధర సుమారు రూ.500 వరకు ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. నిజానికి కొన్నేళ్లు క్రితం వరకు చాలా సినిమాలకు బెనిఫిట్ షోలు మాత్రమే పడేవి. ఇప్పుడు మళ్లీ అదే ట్రెండ్ ను ఉస్తాద్ మేకర్స్ ఫాలో అవ్వనున్నారన్న మాట. తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ప్రీమియర్ షోలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. అక్కడ రాత్రి ప్రీమియర్స్ ఉంటాయా, లేక ఉదయం బెనిఫిట్ షోలు వేస్తారా అనే అంశంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. మరికొన్ని గంటల్లో నిర్ణయం తీసుకోనున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే తెలంగాణలో టికెట్ ధరల పెంపు కావాలంటే 90 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలని ఇటీవల ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఆదేశాలపై స్టే లభించింది. దీంతో ఇప్పుడు మైత్రీ సంస్థ.. రేట్ల పెంపుతో పాటు ప్రీమియర్స్ కోసం అనుమతులు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనుందని సమాచారం. ఇక ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విషయానికొస్తే.. పవన్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్ లో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దివ్యేందు శర్మ, అశుతోష్ రాణా, నవాబ్ షా, శంకర్ పార్థిబన్, గౌతమి, చమ్మక్ చంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఆ చిత్రానికి తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. మరి తెలుగు స్టేట్స్ ప్రీమియర్స్ విషయంపై ఎప్పుడు క్లారిటీ వస్తుందో వేచి చూడాలి.



# అనసూయపై తప్పుడు పోస్టులు

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తులపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేసే వారిపై నిఘా కొనసాగుతుందని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాకు చెందిన జనార్ధన్ ప్రస్తుతం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇంద్రానగర్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. అతడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో ఫేక వీడియోలను రూపొందించి వాటిని ఇన్ స్టాగ్రామ్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో పోస్ట్ చేశాడు. ఆ వీడియోలకు అసభ్యకర వ్యాఖ్యలు యాడ్ చేసి వైరల్ చేశాడు. దీంతో అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దాని ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు డిజిటల్ ప్రూఫ్స్ సేకరించి నిందితుడు జనార్ధన్ ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సోషల్ మీడియాలో వ్యూస్, ఫాలోవర్లు పెంచుకోవాలనే ఉద్దేశంతో ఆ పోస్టులు పెట్టినట్లు నిందితుడు అంగీకరించినట్లు సమాచారం. అతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా మరో ఘటనలో సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లికి చెందిన అరుణ్ కుమార్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అనసూయ సోషల్ మీడియాలో అప్లోడ్ చేసిన రీల్ పై అతడు కామెంట్ సెక్షన్ లో అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ విషయం పై దర్యాప్తు జరిపిన సైబర్ క్రైమ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జైలుకు పంపినట్లు తెలిపారు.




# కయాదు సింగిలేనా? పెళ్లి చేసుకోవాలని ఉందట..!

టాలీవుడ్, కోలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్‌వాంటెడ్ హీరోయిన్ కయాదు లోహర్. ఇటీవల ఈమె నటించిన 'ఫంకీ' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద సత్తా చాటలేక పోయింది. అయినా కూడా ఈమె జోరు మామూలుగా లేదు. ప్రస్తుతం ఈమె చేతిలో అయిదు ఆరు సినిమాలు ఉన్నాయి. తెలుగులో ఈమె రెండు మూడు సినిమాలు చేస్తోంది. తమిళ్‌లో ఈమె స్టార్ హీరోల సినిమాలను కమిట్ అయింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన చాలా తక్కువ సమయంలో ఇంత బిజీ కావడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. ఈ అమ్మడి జోరు చూస్తూ ఉంటే అతి త్వరలోనే అత్యధిక పారితోషికం అందుకునే హీరోయిన్‌గానూ నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న ఈ అమ్మడు తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పెళ్లి గురించి ఆ ఇంటర్వ్యూలో కయాదు లోహర్‌ను యాంకర్ ప్రశ్నించిన సమయంలో క్లీయర్ సమాధానం ఇచ్చింది. పెళ్లి చేసుకునే ఆలోచన ఉందని, తప్పకుండా తాను పెళ్లి చేసుకుంటాను అని చెప్పుకొచ్చింది. ఆ సమయంలోనే యాంకర్ మాట్లాడుతూ కయాదు లోహర్ ప్రేమలో ఉందా, ఎవరితో అయినా రిలేషన్‌లో ఉందా అంటూ ప్రశ్నించింది. అప్పుడు కయాదు గట్టిగా నవ్వుతూ ప్రస్తుతానికి నేను పనితోనే రిలేషన్‌లో ఉన్నాను, పనితో మాత్రమే ప్రేమలో ఉన్నాను అని నవ్వింది. క్లీయర్‌గా చెప్పాలంటే నేను సింగిల్‌గానే ఉన్నాను. కమిట్ కాలేదు అంటూ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఈమె ఒక యంగ్ హీరోతో ప్రేమలో ఉందనే పుకార్లు షికార్లు చేశాయి. ఆ వార్తలపై కయాదు స్పందించలేదు. దాంతో కయాదు ప్రేమ వ్యవహారం గురించి అంతా సైలెంట్ అయ్యింది. ప్రస్తుతానికి సింగిల్ అయినప్పటికీ తాను భవిష్యత్తులో పెళ్లి చేసుకునే ఆలోచనతో ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

# బాలీవుడ్‌లో బిజీగా ఉన్న సాయి పల్లవి



సౌత్ ఇండియా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సిని పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ ఇప్పుడు బాలీవుడ్‌ను ఏలేందుకు సిద్ధమవుతోంది. అసలు తన తొలి హిందీ సినిమా విడుదల కాకముందే అక్కడ వరుస ఆఫర్లతో వార్తల్లో నిలుస్తోంది. అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్‌తో 'ఏక్ దిన్', రణబీర్ కపూర్‌తో ప్రతిష్టాత్మక 'రామాయణం' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు మరో ఐకానిక్ రోల్ కోసం చర్చల్లో ఉంది. బాలీవుడ్ అగ్ర దర్శకుల కళ్ళు ఇప్పుడు ఈ టాలెంటెడ్ బ్యూటీపైనే ఉన్నాయి. ఆ వివరాలు ఇలా వున్నాయి.. సాయి పల్లవి కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకోవడంలో దిట్ట అని మనకు తెలిసిందే. తాజాగా ఆమెకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతోంది. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారి బయోపిక్‌లో సాయి పల్లవి నటించబోతున్నట్లు సమాచారం. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం ఆమెను ఫైనలైజ్ చేశారని టాక్. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, సాయి పల్లవి వంటి అద్భుతమైన నటి ఈ పాత్రకు సరిగ్గా సరిపోతుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 'అమరన్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న సాయి పల్లవికి ఇదొక గొప్ప మైలురాయి కానుంది. ఇక ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాత్రే కాకుండా, మరో క్రేజీ ఆఫర్ కూడా ఆమె తలుపు తట్టినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ లెజెండరీ బ్యూటీ మధుబాల బయోపిక్‌ను అగ్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ప్లాన్ చేస్తున్నారు. ఈ పాత్ర కోసం కియారా అద్వానీ వంటి స్టార్ల పేర్లు వినిపించినా, భన్సాలీ మాత్రం సాయి పల్లవి వైపే మొగ్గు చూపుతున్నట్లు బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. ఇక సాయి పల్లవికి ఉన్న నేచురల్ లుక్, అద్భుతమైన నటన మరియు దేశవ్యాప్తంగా ఉన్న పాపులారిటీ ఈ పాత్రకు ప్లస్ అవుతాయని మేకర్స్ భావిస్తున్నారు. ఇక భన్సాలీ సినిమాల్లో నటించడం అంటేనే ఒక పెద్ద గౌరవం, అలాంటిది మధుబాల లాంటి ఐకానిక్ పాత్రలో సాయి పల్లవి కనిపిస్తే అంతకంటే కావాల్సింది ఏముంది ఇంకా అంటున్నారు ఫాన్స్.

# సీజన్ మారుతోంది.. ఈ సమయంలో వచ్చే అలర్జీల నుంచి ఇలా తప్పించుకోండి



ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సీజనల్ మార్పులు కూడా జరుగుతున్నాయి. ఈ వాతావరణం కొంత ఆనందంగా అనిపించినప్పటికీ, అదే సమయంలో పోలెన్ (పువ్వుల రేణువులు), బూజు, దుమ్ము వంటి అలెర్జీలు పెరుగుతాయి. ఇవి సీజనల్ అలెర్జీలను కలిగిస్తాయి. దీనిని అలర్జిక్ రైనిటిస్ అని కూడా అంటారు. గాల్లో ఉన్న అలెర్జీ కారకాలు కళ్లలో, ముక్కులో, గొంతులోకి వెళ్లినప్పుడు శరీరం అలెర్జిక్ ప్రతిచర్యను చూపిస్తుంది. ఈ సమయంలో పోలెన్ ఎక్కువగా ఉండటం వల్ల అలెర్జీలు ఎక్కువగా కనిపిస్తాయి. కాబట్టి సీజన్ మార్పుల సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. సీజనల్ మార్పుల సమయంలో అలెర్జీలను నివారించడానికి కొన్ని చిట్కాలను పాటించడం చాలా అవసరమని కూడా వారు చెబుతున్నారు. సీజనల్ మార్పుల సమయంలో అలర్జీల నుండి ఎవరిని వారు కాపాడుకోవడానికి పాటించాల్సిన కొన్ని చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఉదయం పూట ఎక్కువ..

సీజన్ మార్పుల సమయంలో పుప్పొడి స్థాయిలను ట్రాక్ చేయడం చాలా ముఖ్యం. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు చెట్ల పుప్పొడి ఎక్కువగా పెరుగుతుంది. సాధారణంగా పోలెన్ స్థాయిలు ఉదయం ఎక్కువగా ఉంటాయి, మధ్యాహ్నం వరకు కొనసాగి సాయంత్రం తగ్గుతాయి. పోలెన్ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం తగ్గించి, అది తగ్గిన తర్వాతే బయటకు వెళ్లి పనులు చేసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. అలాగే కిటికీలు తెరిచి ఉంచితే అలెర్జీ కారకాలు ఎక్కువగా ఇంట్లోకి వస్తాయి. కాబట్టి పోలెన్ ఎక్కువగా ఉన్న కాలంలో కిటికీలు మూసి ఉంచాలి. గది చల్లగా ఉండటానికి ఫ్యాన్లు లేదా ఎయిర్ కండిషనర్ ఉపయోగించండి. కారులో ప్రయాణిస్తున్నప్పుడు కూడా కేబిన్ ఫిల్టర్ ఉపయోగించి, వెంటిలేషన్ మూసి ఉంచడం మంచిది.

### హెపా ప్యూరిఫైర్‌లు అయితే బెటర్..

అలాగే పోలెన్ చాలా సులభంగా జుట్టు, చర్మం, కనుబొమ్మలు, బట్టలపై అంటుకుంటుంది. కనుక బయట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. ముఖం, తల బాగా శుభ్రం చేసుకోవాలి. ముక్కులో సలైన్ స్ప్రే వాడితే సైనస్‌లు శుభ్రపడతాయి. బయట వేసుకున్న దుస్తులను వెంటనే ఉతుక్కోవడం మంచిది. అదే విధంగా హెపా ఎయిర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించాలి. ఇవి చాలా చిన్న పోలెన్ కణాలను కూడా (0.3 మైక్రాన్ వరకు) గ్రహించి గాలిని శుభ్రం చేస్తాయి. బెడ్‌రూమ్, లివింగ్ ఏరియాలో వీటిని ఉంచి రోజంతా ఉపయోగిస్తే మంచిది. డీహ్యూమిడిఫైయర్ ఉపయోగించి గదిలో తేమను 50% కంటే తక్కువగా ఉంచితే అలెర్జీలు తగ్గుతాయి. దుమ్ము, పోలెన్ ఇంటి ప్రతి ఉపరితలంపై పడతాయి. కాబట్టి కార్పెట్‌లు, రగ్గులు, సోఫాలను వారానికి ఒకసారి హెపా ఫిల్టర్ ఉన్న వాక్యూమ్‌తో శుభ్రం చేయడం మంచిది. నేలను తడి మాప్‌తో తుడవాలి. పుప్పొడి దుస్తులపై పడే అవకాశం ఉంది కనుక బెడ్ షీట్లు, దుప్పట్లు, దిండు కవర్లు వేడి నీటితో తరచుగా కడుగుతూ ఉండాలి. వాటిని బయట ఎండబెట్టడం కంటే ఇంట్లోనే ఆరబెట్టడం మంచిది.

### ఎన్95 మాస్కు వినియోగం..

అలాగే బయట పనులు చేసే వారు ఎన్95 మాస్క్ ధరించడం మంచిది. ఇది గాల్లో ఉన్న 95% వరకు కణాలను అడ్డుకుంటుంది. అలాగే కళ్లను రక్షించడానికి సన్‌గ్లాసెస్, ముఖాన్ని కాపాడేందుకు పెద్ద టోపీ ధరించండి. గాలి ఎక్కువగా ఉన్న రోజుల్లో ముక్కు మీద స్కార్ఫ్ వేసుకోవడం ద్వారా అలెర్జీ కారకాలు శరీరంలోకి ప్రవేశించకుండా ఉంటాయి. శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండేలా ఎక్కువగా నీటిని తాగుతూ ఉండాలి. నీటిలో నిమ్మకాయ లేదా కీరదోస కలిపి తాగితే విటమిన్ సి లభిస్తుంది. ఇలా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే పసుపు పాలు, అల్లం టీ, వెల్లుల్లి కలిగిన వంటకాలు తినడం మంచిది. అవిసె గింజల వంటి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉన్న ఆహారాలను తీసుకోవడం ద్వారా వాపులు తగ్గి అలెర్జీలు తగ్గుతాయి. ఈ విధంగా సులభమైన చిట్కాలను ఉపయోగించి అలెర్జీల బారిన పడకుండా ఎవరిని వారు కాపాడుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. అంతేకాకుండా అలెర్జీ లక్షణాలు మొదలయ్యాక కాకుండా ముందు నుండే మందులు తీసుకోవడం మంచిదని, ఫిబ్రవరి చివర్లోనే యాంటీహిస్టమైన్ లేదా నాజల్ స్ప్రేలు వాడడం మొదలుపెట్టడం వల్ల అలెర్జీ తీవ్రత తగ్గుతుందని దీంతో అలెర్జీల వల్ల కలిగే అసౌకర్యం తగ్గుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండి సరిగ్గా పనిచేయాలంటే.. ఈ ఆహారాలను రోజూ తీసుకోవాలి



ఫైబర్ శరీరానికి చాలా అవసరం. జీర్ణవ్యవస్థకు ఫైబర్ ఒక రాజు వంటిది అని చెప్పవచ్చు. కానీ అన్ని ఫైబర్‌లు ఒకేలా ఉండవు. ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరంతో పాటు అజీర్తి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక కడుపుకు ఇబ్బంది లేకుండా, కడుపు ఉబ్బరం రాకుండా, శరీరానికి స్థిరమైన శక్తిని ఇచ్చే అధిక ఫైబర్ ఉన్న స్నాక్స్ తీసుకోవడం మంచిది అని వైద్యులు చెబుతున్నారు. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు చాలా మందిలో సాధారణంగా కనిపిస్తాయి. అలాంటి వారు ఈ స్నాక్స్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అమెరికన్ డైటరీ గైడ్‌లైన్స్ ప్రకారం, రెండు సంవత్సరాల పైబడిన వ్యక్తులు రోజుకు తీసుకునే ప్రతి 1,000 కేలరీలకు సుమారు 14 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. 12 నెలల నుంచి 23 నెలల మధ్య ఉన్న పిల్లలకు రోజుకు 19 గ్రాముల ఫైబర్ ఇవ్వాలి. ఫైబర్ ఆరోగ్యానికి చాలా అవసరం అయినప్పటికీ, అధిక ఫైబర్ ఉన్న ప్రతి ఆహారం సులభంగా జీర్ణం అవ్వాలని లేదు. కనుక తరచూ కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడే వారు జీర్ణ ఆరోగ్యానికి సహాయపడే విత్తనాలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలు, పండ్లు తీసుకోవడం మంచిది. ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గించి జీర్ణ వ్యవస్థకు మేలు చేసే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### విత్తనాలు, గింజలు..

గుమ్మడికాయ గింజలు, సబ్జా గింజలు, పొడి చేసిన అవిసె గింజలు, చియా గింజలు వంటి వాటిలో ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. అలాగే కొన్ని రకాల గింజల్లో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ సులభంగా జీర్ణమవుతాయి. వాల్‌నట్స్, డ్రై రోస్టెడ్ పల్లీలు, మఖానా వంటివి సులభంగా జీర్ణమవ్వడంతో పాటు వీటిలో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. అలాగే బటర్, నెయ్యి వంటివి వేయకుండా ఎయిర్ పాప్ చేసిన పాప్ కార్న్ వంటి స్నాక్స్ కూడా తీసుకోవచ్చు. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు సులభంగా జీర్ణమవుతాయి. అదే విధంగా స్ప్రౌటెడ్ బ్రెడ్, సవర్డో బ్రెడ్, స్టీల్-కట్ ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో చేసిన ఆహారాలు కూడా జీర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉండడంతో పాటు శరీరానికి ఎక్కువసేపు శక్తిని అందిస్తాయి. టెంపెహ్, ఫర్మ్ లేదా ఎక్స్‌ట్రా-ఫర్మ్ టోఫు వంటి మొక్క ఆధారిత ప్రోటీన్ ఆహారాలు సంతృప్తికరమైనవి. ఇవి తక్కువ ఉబ్బరాన్ని కలిగిస్తాయి. వీటిని ఫైబర్ అధికంగా ఉండే డైట్‌తో కలిపి తింటే కడుపుకు తేలికగా ఉంటుంది.

### పండ్లు, కూరగాయలు..

ఇక పండ్లు, కూరగాయలు సులభంగా జీర్ణం అవ్వడంతో పాటు అధిక ఫైబర్ ను కలిగి ఉంటాయి. ఉడికించిన క్యారెట్, బ్లూబెరీస్, స్ట్రాబెరీస్, రాస్ప్‌బెరీస్, కివీ పండు, ఆరెంజ్, మాండరిన్, కొంచెం పచ్చగా ఉన్న అరటిపండు, బొప్పాయి వంటి ఆహారాలు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. ఇటువంటి ఆహారాల్లో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు పొట్టకు కూడా తేలికగా ఉంటాయి. కడుపు ఉబ్బరంతో పాటు ఇతర జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను గట్ ఫ్రెండ్లీ స్నాక్స్ ను ఎంచుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# మహిళల్లో అధికంగా వచ్చే వ్యాధులు ఇవే.. ముందుగానే గుర్తిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు..



మహిళల ఆరోగ్యం జీవశాస్త్రం, హార్మోన్ల కారణంగా కొన్ని వ్యాధులు పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పురుషులు, మహిళలు కొన్ని వ్యాధులకు సమానంగా గురవుతారు. కానీ హార్మోన్ల మార్పులు, పునరుత్పత్తి ఆరోగ్యంతో సంబంధం ఉన్న సమస్యలు మహిళల్లో ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా థైరాయిడ్ సమస్యలు, పీసీఓఎస్, ఆటోఇమ్యూన్ వ్యాధులు, ఆస్టియోపోరోసిస్, రక్తహీనత వంటి సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మహిళలు ఇబ్బందిపడుతున్నారు. ఈ వ్యాధులు పురుషుల కంటే మహిళల్లో చాలా ఎక్కువగా కనిపిస్తాయని అయినప్పటికీ ఈ వ్యాధులను చాలా మంది సరైన సమయంలో గుర్తించరని వైద్యులు చెబుతున్నారు. పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపించే కొన్ని వ్యాధుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### థైరాయిడ్, పీసీవోఎస్..

భారతదేశంలో ప్రతి 10 మంది మహిళల్లో ఒకరు థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నారని అంచనా. థైరాయిడ్ అనేది ఎండోక్రైన్ వ్యవస్థలో భాగమైన చిన్న సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న గ్రంథి. ఇది మెడ ముందు భాగంలో చర్మం కింద ఉంటుంది. ఈ గ్రంథి థైరాక్సిన్, ట్రైయోడోథైరోనిన్ అనే హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇవి శరీరంలోని అనేక ముఖ్యమైన పనులను నియంత్రిస్తాయి. Indian Journal of Endocrinology and Metabolism ప్రకారం దాదాపు 15.86% మహిళల్లో థైరాయిడ్ సమస్యలు కనిపిస్తున్నాయి. అలాగే మహిళల్లో ఎక్కువగా కనిపించే మరో సమస్య పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్). పీసీఓఎస్ అనేది మహిళల్లో కనిపించే సాధారణ హార్మోన్ల సమస్య. ఇందులో ఆండ్రోజెన్ హార్మోన్లు సాధారణ కంటే ఎక్కువగా ఉంటాయి. దీంతో పీరియడ్స్ సరిగ్గా రాకపోవడం, అండోత్పత్తి సమస్యలు, గర్భం దాల్చడంలో ఇబ్బందులు, ముఖం లేదా శరీరంపై ఎక్కువ వెంట్రుకలు, మొటిమలు వంటి సమస్యలు వస్తాయి.

### ఆటో ఇమ్యూన్ వ్యాధులు, ఆస్టియోపోరోసిస్..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకారం ప్రసవ వయస్సులో ఉన్న మహిళల్లో 10-13% మందికి PCOS ఉంటుంది. కానీ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70% మహిళలకు తమకు PCOS ఉందని తెలియదు. వీటితో పాటు ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా మహిళల్లో ఎక్కువగా వస్తున్నాయి. ఆటోఇమ్యూన్ వ్యాధుల్లో శరీరంలోని ఇమ్యూన్ సిస్టమ్ తప్పుగా ఆరోగ్యకరమైన కణాలపై దాడి చేస్తుంది. దీని వల్ల రుమటాయిడ్ ఆర్థరైటిస్, క్రోన్స్ వ్యాధి, థైరాయిడ్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇవి దీర్ఘకాలిక వ్యాధులు కనుక వీటి లక్షణాలను జీవితకాలం నియంత్రించుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఆస్టియోపోరోసిస్‌ను ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే వ్యాధిగా భావించేవారు. కానీ ఇప్పుడు 30-40 సంవత్సరాల మహిళల్లో కూడా ఎముకలు బలహీనపడటం కనిపిస్తోంది. ఆస్టియోపోరోసిస్ ఒక ఎముకల వ్యాధి. ఇందులో ఎముకల సాంద్రత తగ్గడంతో పాటు ఎముక నిర్మాణం బలహీనపడుతుంది. దీంతో ఎముకలు సులభంగా విరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. చిన్న గాయం కారణంగా కూడా ఫ్రాక్చర్ వచ్చే అవకాశంపెరుగుతుంది. ఆస్టియోపోరోసిస్‌ను చాలాసార్లు సైలెంట్ డిసీజ్ అని పిలుస్తారు. ఎందుకంటే ఎముక విరిగే వరకు సాధారణంగా లక్షణాలు కనిపించవు.

### రక్తహీనత..

ఐరన్ డెఫిషియెన్సీ అనీమియా ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ పోషక లోప వ్యాధుల్లో ఒకటి. పీరియడ్స్, గర్భధారణ, ఆహారపు అలవాట్ల కారణంగా మహిళలు దీనికి ఎక్కువగా గురవుతూ ఉంటారు. ఈ వ్యాధి రక్తంలోని రెడ్ బ్లడ్ సెల్స్‌ను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో తీవ్రమైన అలసట, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి సాధారణంగా ఐరన్ మాత్రలు లేదా ఐరన్ ఇన్ఫ్యూషన్ల ద్వారా చికిత్స చేస్తారు. మహిళల్లో కనిపించే ఈ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, సరైన ఆహారం తీసుకోవడం, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ఉండడం ద్వారా ఈ వ్యాధులను నియంత్రించవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# ఏయే అనారోగ్య సమస్యలు ఉన్నవారు చియా విత్తనాలను తీసుకోకూడదు



చిన్నగా ఉన్నప్పటికీ చియా గింజలు అనేక పోషకాలను కలిగి ఉంటాయి. ఆరోగ్యకరమైన డైట్‌లో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. చియా గింజల్లో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియతో పాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి వాపును తగ్గించడంలో సహాయపడతాయి. చియా గింజలు నీటిని తమ బరువుకు 10-12 రెట్లు వరకు పీల్చుకుంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. అలాగే ఎక్కువసేపు పొట్ట నిండిన భావన కలిగించి బరువు నియంత్రణకు కూడా సహాయపడతాయి. మింగడంలో ఇబ్బంది ఉంటే..

అయితే చియా గింజలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ ఇవి అందరికీ సరిపోవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని జాగ్రత్తగా తీసుకోవాలి లేదా పూర్తిగా నివారించడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎటువంటి సమస్యలతో బాధపడే వారు చియా గింజలు తీసుకునే విషయంలో జాగ్రత్త వహించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

చియా గింజలు నీటిలో నానబెట్టినప్పుడు పరిమాణంలో పెరుగుతాయి. మింగడంలో ఇబ్బంది ఉన్నవారికి లేదా ఆహార నాళం సన్నగా ఉన్నవారికి ఇవి ప్రమాదకరంగా మారవచ్చు. అలాగే పొడిగా తింటే అరుదుగా ఆహారనాళం బ్లాక్ అయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ ముందుగా నీటిలో నానబెట్టే తినాలనే వైద్యులు సూచిస్తున్నారు.

### ఐబీఎస్ ఉంటే..

చియా గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కనుక IBS ఉన్న వారిలో ఇది పొట్ట ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలను పెంచవచ్చు. 2 టేబుల్ స్పూన్ల చియా గింజల్లో దాదాపు 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఒక్కసారిగా ఎక్కువ ఫైబర్ తీసుకుంటే ×దీూ ఉన్నవారికి ఇబ్బంది కలగవచ్చు. అలాగే రక్తాన్ని పలుచగా చేసే మందులు వాడే వారు కూడా వీటిని తీసుకునే విషయంలో జాగ్రత్త వహించడం మంచిది. చియా గింజల్లో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లం ఉంటుంది. ఇది కొంతవరకు రక్తాన్ని పలుచగా చేసే ప్రభావం కలిగించవచ్చు. అందువల్ల రక్తాన్ని పలుచగా చేసే మందులు తీసుకునే వారు ఎక్కువ పరిమాణంలో చియా గింజలు తినే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. అదే విధంగా కొందరిలో గాస్ట్రోపారేసిస్ లేదా ఇతర జీర్ణక్రియ మొటిలిటీ వంటి సమస్యలు ఉంటాయి. చియా గింజలు నీటితో కలిసినప్పుడు జెల్‌లా మారతాయి. ఈ జెల్‌లాంటి ఫైబర్ జీర్ణక్రియను మరింత కష్టతరం చేయవచ్చు.

### అలర్జీలు ఉన్నా..

అలాగే కొంతమందికి ఈ గింజలకు అలర్జీ ఉండవచ్చు. అలాంటి వారికి చియా గింజలు తింటే అలర్జిక్ రియాక్షన్ వచ్చే అవకాశం ఉంది. చియా గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఫైబర్, ఒమెగా-3, పాలీఫీనాల్స్, ప్రీబయోటిక్ లాభాలు అందిస్తాయి. అయితే వీటిని తీసుకునే ముందు పరిమాణం, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవడం కూడా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చియా గింజలను తీసుకునే సరైన పద్ధతి గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చియా గింజలు నీటిని ఎక్కువగా పీల్చుకుంటాయి కాబట్టి ముందుగా నానబెట్టి తినాలి. మొదట 1 టేబుల్ స్పూన్‌తో ప్రారంభించాలి. నీరు, పెరుగు లేదా స్మూతీలో నానబెట్టి తీసుకోవడం మంచిది. తరువాత వీలును బట్టి నెమ్మదిగా 2 టేబుల్ స్పూన్ల వరకు పెంచుకోవచ్చు. చియా గింజలు చాలా పోషకమైన ఆహారం అయినప్పటికీ, కొన్ని ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి లేదా పూర్తిగా నివారించడం మంచిది అని వైద్యులు సూచిస్తున్నారు.

# దడపుట్టిస్తున్న రోడ్డు ప్రమాదాలు

## ప్రాణాలు పోతున్నా పట్టించుకోని వాహనదారులు

## వేర్వేరు ఘటనల్లో ఏడుగురు దుర్మరణం

**హైదరాబాద్,మార్చి14 :** వరుస రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్లక్ష్యం డ్రైవింగ్‌తో కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇకపోతే అతి వేగం, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం ప్రాణాలకు ప్రమాదం అని అధికారులు చెబుతున్నారు. అయితే కొంతమంది డ్రైవర్లు ఇవి ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని గంటల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో భారీ ప్రాణ నష్టం సంభవించింది. మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం రాంపూర్ వద్ద ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో తండ్రీ కొడుకులు అమృత్ గౌడ్(51), రిశివర్ధన్ గౌడ్(13) తో పాటు సాయి గౌడ్(32) ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ స్టేషన్ సమీపంలో స్కూటీని బొలెరో వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రి వద్ద ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటనలో శ్రీనివాస్, విజయ్ అనే ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు డ్రైవర్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# వీసా గడువు ముగిసినా నగరంలోనే తిష్ట

## నైజీరియన్‌ను గుర్తించి తిప్పిపంపిన పోలీసులు

**హైదరాబాద్,మార్చి14 :** నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో అక్రమంగా నివాసం ఉంటున్న నైజీరియన్ జాతీయుడిని ఈగల్ టీమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యక్తిని విక్టరీ పుయామగన్ (34) అలియాస్ కెన్నీగా గుర్తించిన అధికారులు ఎనిమిదేళ్లుగా భారతదేశంలో ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నివసిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అనుమతులతో స్వదేశానికి డిపోర్ట్ చేశారు. పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. విక్టరీ అపుయామగన్ 2018లో ఘనా నకిలీ పాస్‌పోర్ట్ సాయంతో భారత్‌లోకి ప్రవేశించాడు. మెడికల్ అటెండెంట్ వీసాపై తొలుత ఢిల్లీకి చేరుకున్న కెన్నీ.. ఆ తర్వాత పంజాబ్‌కు వెళ్లి అక్కడ కొంత కాలం జిమ్ ట్రైనర్‌గా పనిచేశాడు. అయితే, తన వీసా గడువు ముగిసినప్పటికీ అధికారులకు దొరక్కుండా అక్రమంగా దేశంలో ఉండిపోయాడు. 2025లో సినిమాల్లో నటించాలనే కోరికతో హైదరాబాద్ కు చేరుకున్న కెన్నీ.. ఇక్కడ జూనియర్ ఆర్టిస్ట్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టాడు. తన శారీరక దారుఢ్యంతో ఇప్పటివరకూ సుమారు 5 సినిమాల్లో చిన్న పాత్రలు దక్కించుకున్నాడు. ఇటీవల విడుదలైన హిందీ మూవీ 'టస్కరి'లో నటించిన కెన్నీ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తెలుగు మూవీ 'వారణాసి'లోనూ నటిస్తున్నాడు. వీసా గడువు ముగిసినా, నకిలీ పత్రాలతో చలామని అవుతున్నాడన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ కొండాపూర్‌లో నిఘా పెట్టి అతడిని అదుపులోకి తీసుకుంది. సరైన అనుమతి పత్రాలు లేకపోవడం, నకిలీ పాస్‌పోర్ట్ వినియోగించినందుకు గాను అతడిని అరెస్ట్ చేసి నిబంధనల ప్రకారం స్వదేశానికి పంపించివేశారు.

# పెండింగ్ ప్రాజెక్ట్‌ల కోసం పోరాటం

## మాజీమంత్రి నాగం జనార్ధన్ రెడ్డి

**నాగర్ కర్నూల్,మార్చి14 :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే ప్రాజెక్టు ప్రాంతాల వద్ద పోరాటం చేస్తానని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పెండింగ్‌లో ఉన్న 3 కిలోమీటర్ల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తాగునీరు, సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే వయ-స్సును లెక్కచేయకుండా పోరాటాలు చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో విద్యుత్ సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఎత్తిపోతల పథకంలో ఐదు మోటర్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని , రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం కాదు, రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు.

# పాతబస్తీలో యువకుడి అదృశ్యం విషాదాంతం

## పాడుబడ్డ బావిలో కుళ్లిన స్థితిలో శవం స్వాధీనం

**హైదరాబాద్,మార్చి14 :** పాతబస్తీలో కలకలం రేపిన యువకుడి అదృశ్యం విషాదాంతమైంది. పది రోజులుగా ఆచూకీ లేని యువకుడు ఓ పాడుబడిన బావిలో శవమై తేలడంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో పెరుగుతున్న నేరాలు, అనుమానాస్పద మరణాల నేపథ్యంలో ఈ ఘటన పోలీసులకు సవాలుగా మారింది. హైదరాబాద్‌లోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో గౌతమ్ కుమార్ (20) అనే యువకుడు గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయాడు. మార్చి 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గౌతమ్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. అయితే.. మార్చి 13వ తేదీ రాత్రి రాజన్న బావి సమీపంలోని 'పులమ్మ బావి' నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలో చూడగా ఒక మృతదేహం కనిపించింది. ట్యాంక్ బండ్ శివ బృందం సహాయంతో మృతదేహాన్ని వెలికితీయగా.. అది గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయి, అస్థిపంజరంలా మారిపోయింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు అది అదృశ్యమైన గౌతమ్ కుమార్‌దిగా ప్రాథమికంగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారుజ పది రోజుల పాటు యువకుడు ఎక్కడ ఉన్నాడు..? ఎవరైనా హత్య చేసి బావిలో పడేశారా లేక ఆత్మహత్య చేసుకున్నాడా..? అనే కోణాల్లో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలను ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఈ ఘటన పాతబస్తీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ముమ్మరంగా మొక్కల పెంపకం

## హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి




హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణ సుందరీకరణలో భాగంగా రానున్న వర్షాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలో నిర్వహిస్తున్న 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఆమె స్థానిక నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెరుగుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించి, వాటి సంరక్షణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ... వర్షాకాలంలో పట్టణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.ముఖ్యంగా ఇంటింటికీ పంపిణీ చేసేందుకు ప్రజలకు ఉపయోగపడే పండ్లు, పూల మొక్కలను అధిక సంఖ్యలో పెంచాలని అధికారులకు సూచించారు. పట్టణాన్ని హరితవనంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.మొక్కల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వార్డుల వారీగా జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బలిశెట్టి రాజు, పూదరి వరప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

# సాయుధ పోరాట యోధులకు తగిన గుర్తింపునివ్వాలి

## సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ సాయుధ పోరాట యోధులకు గత ప్రభుత్వాల హయాంలో తగిన గుర్తింపు లభించలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చొరవ చూపి వారి త్యాగాలను స్మరించుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కోరారు.శనివారం కరీంనగర్ జిల్లా మహ్మదాపూర్ గ్రామంలో అమరవీరుల స్మారక స్తూపం వద్ద ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంత భూషణ గట్లల్లో అసువులు బాసిన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డి వంటి 10 మంది వీరయోధుల సమాధుల వద్ద శ్రద్ధాంజలి ఘటించి, ఎర్రజెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ...నాడు భూమి, భుక్తి, విముక్తి కోసం రజాకార్ల తుపాకి తూటాలకు ఎదురొడ్డి పోరాడిన ఫలితంగానే నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. 78 ఏళ్లు గడుస్తున్నా ఆనాటి త్యాగధనులకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రజా పాలనలో భాగంగా అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని, వారి కుటుంబాలకు తగిన గుర్తింపునిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీల పోరాట ఫలితంగానే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందని, నేడు ఎర్రజెండా శ్రేణులు విడిపోవడం వల్ల సంక్షేమ పథకాలు పేదలకు చేరడం లేదని, అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, పక్కా ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ప్రజలు పథకాల కోసం అడుక్కునే దుస్థితి రాకూడదని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఏప్రిల్ నెలలో 'గడప గడపకు సీపీఐ' పేరుతో ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేశం, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, అనభేరి కుటుంబ సభ్యులు పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హరీష్ రావును కలిసిన శారదాపీఠం ఉత్తరాధికారి

## ఆలయంలో ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం

**హైదరాబాద్,మార్చి14 :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వచ్చిన స్వామిజీ.. ఆయనకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం కోకాపేట నియోపోలిస్‌లోని శ్రీ రాజశ్యామల దేవస్థానంలో ఈ నెల 19 న జరగనున్న ప్రభవ నామ సంవత్సర ఉగాది ఆస్థానం, అలాగే 27న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాల్సిందిగా హరీశ్ రావును స్వామిజీ సాదరంగా ఆహ్వానించారు. శ్రీ రాజశ్యామల అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా హరీశ్ రావు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతులు పూజలు

## రుద్రాభిషేకం, కుంకుమార్చనలో పాల్గొన్న గవర్నర్

**శ్రీశైలం,మార్చి14 :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శనివారం తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ దంపతులకు దేవస్థానం అర్చకులు, పండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో వారికి స్వామి అమ్మ వార్ల చిత్రపటాలను అందజేశారు. శ్రీశైల క్షేత్ర విశేషాల గ్రంథాన్ని గవర్నర్‌కు ఈవో బహూకరించారు. గవర్నర్‌గా నియమితులు అయ్యాక శుక్లా శుక్రవారం శ్రీశైలం చేరుకున్నారు. వేకువ జామునే ఆయన ఆలయం చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇదిలావుంటే శ్రీశైలంలో భారీగా రద్దీ పెరగింది. వరు సెలవులకు తోడు కన్నడ భక్తుల రాకతో శ్రీశైలం కిటకిటలాడుతోంది.

# శబరిమలలో మహిళలకు ప్రవేశం

## యూ టర్న్ తీసుకున్న కేరళ ప్రభుత్వం

## 50 ఏళ్ల లోపు వారికి అనుమతి కుదరదు

## సుప్రీంకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం



**తిరువనంతపురం,మార్చి14 :** 50 ఏళ్లలోపు మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించే అంశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల్ని ఆలయంలోకి అనుమతించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేరళం సీఎం పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దీనిపై ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భక్తుల మనోభావాలు, ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, త్వరలోనే కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ కోణంలోనే ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు

ఆరోపిస్తున్నాయి. శబరిమల ఆలయంలోకి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రవేశం కల్పించాలని కొన్నేళ్లక్రితం ఆందోళనలు చెలరేగాయి. అయితే, ఈ నిర్ణయాన్ని శబరిమల ఆలయ యాజమాన్య బాధ్యతలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్తాన బోర్డు వ్యతిరేకించింది. ఎప్పటినుంచో ఉన్న సంప్రదాయం ప్రకారం.. మహిళలకు మెనుస్ట్రువల్ సైకిల్ ఉండే పదేళ్ల వయసు నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్ని ఆలయంలోకి అనుమతించబోమని తెలిపింది. ఈ నిర్ణయాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించింది. అన్ని వయసుల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం అందరు మహిళలు ఆలయంలోకి వెళ్లొచ్చని తెలిపింది.అయితే, ఇప్పుడు ఈ నిర్ణయాన్ని ఎల్డీఎఫ్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. పాత సంప్రదాయాల ప్రకారమే 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై నిషేధం విధిస్తామని కోర్టుకు తెలిపింది. ఈ అంశంలో ప్రభుత్వ నిర్ణయం ఏంటో చెప్పేందుకు తుది గడువు కావడంతో తాజా నిర్ణయాన్ని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ అంశంపై వచ్చే నెల 7 నుంచి సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. మరోవైపు ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంతకాలం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడిన వారిపై నమోదైన కేసుల సంగతేంటని ప్రశ్నిస్తున్నాయి. ఈ నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com